సంక్షిప్తంగా..

నగరంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు: సీపీ

వినాయక్‌నగర్, మే 5: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో సందర్భంగా నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. సోమవారం పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం సైతం స్థలాలను కేటాయించామని తెలిపారు. నగర ప్రజలతోపాటు రోడ్‌షోకు హాజరయ్యేవారు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. బోధన్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి రైల్వే గేట్, కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బై పాస్, ధర్నాచౌక్, రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. నగరం నుంచి బోధన్ వైపు వెళ్లే వాహనాలు రైల్వే ఫ్లై ఓవర్ నుంచి శివాజీ చౌక్, నిజాం కాలనీ, అర్సపల్లి మీదుగా వెళ్లాలి. మాధవనగర్ నుంచి బోధన్‌కు వెళ్లే వాహనాలు పూలాంగ్ సర్కిల్ నుంచి న్యాల్‌కల్ రోడ్డు చౌరస్తా, వర్ని రోడ్డు చౌరస్తా, ఖిల్లా చౌరస్తా, ఈద్గా రోడ్, గోశాల రోడ్, అర్సపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలు.. ఆర్మూర్, డిచ్‌పల్లి వైపు నుంచి రోడ్ షోకు వచ్చే వాహనాలను ప్రెస్‌క్లబ్, ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్, టీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ ముందు స్థలంలో పార్క్ చేయాలి. బోధన్ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం అర్సపల్లి వద్ద ఉన్న శైలజ గ్రౌండ్, ఖిల్లా జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేశారు.

అబద్ధాలు మాని రైతులకు మేలు చేయండి

- ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దే
- అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల

ఖలీల్‌వాడి, మే 5 : కాంగ్రెస్ నేతలు అబద్ధాలు మాని రైతులకు మేలు చేయాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా నగరంలోని 44వ డివిజన్ పరిధిలో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్.. మహిళలకు ఫ్రీ బస్ తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కరెంటు, సాగునీరు లేక రైతులు అల్లాడుతుంటే పట్టించుకోవడంలేదని, పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి మరోసారి అబద్ధాలు మాట్లాడుతున్నాడని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పసుపు బోర్డు తెచ్చే దమ్ము అర్వింద్‌కు లేదని, ప్రశ్నించే గొంతుక బాజిరెడ్డిని ఢిల్లీకి పంపిద్దామన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఈ సారి ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నీలగిరి రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, సూదం రవిచందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలాల్లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం..

డిచ్‌పల్లి/ధర్పల్లి/ఇందల్వాయి/సారంగాపూర్/మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్, మే 5: బాజిరెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు వివిధ మండలాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డిచ్‌పల్లి మండలం దేవుపల్లి, దేవనగర్ క్యాంపు, అమృతాపూర్ వడ్డెర క్యాంప్‌లో బాజిరెడ్డికి మద్దతుగా జడ్పీటీసీ లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు ప్రచారం చేశారు. ధర్పల్లి మండలం కోటాస్‌పల్లి, హొన్నాజీపేట్, వాడి, మద్దుల్ తండా గ్రామాల్లో ఎంపీపీ సారికారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగింది. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి, వెంగల్‌పాడ్ తండా గ్రామాల్లో ఎంపీపీ రమేశ్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దాసు, ఎంపీటీసీ దాసు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ (ఏ), జలాల్‌పూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో మహిళా నాయకురాలు గీత ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియోలు చూపిస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. చందూర్ మండలకేంద్రంతోపాటు రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో సీనియర్ నాయకులు జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా గడప గడపకూ ప్రచారం చేశారు.

నగరంలోని 44వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్, నాయకులు

భీమ్‌గల్ చర్చిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాజిరెడ్డికి ఏసుప్రభు ఆశీస్సులు ఉండాలి: వేముల

భీమ్‌గల్, మే 5: భీమ్‌గల్ మండలంలోని చేంగల్ తండా, భీమ్‌గల్ చర్చిలలో ఆదివారం నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనాల్లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు యేసు ప్రభువు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

మోర్తాడ్ మండలం దోన్‌పాల్‌లో..

డిచ్‌పల్లి మండలం దేవనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్ పట్టణంలో..

రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో..

షుగర్ ఫ్యాక్టరీని మూయించింది కాంగ్రెస్సే

వినాయక్‌నగర్, మే 5: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని కూడా వారే మూయించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ పార్టీ ఆర్ ఆర్ (రాహుల్, రేవంత్) టాక్స్ విధిస్తున్నదని, ఇక్కడ వసూలు చేసిన కోట్ల రూపాయలను ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు అమిత్‌షా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్, ఓవైసీ అంటే భయమని అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని 70 ఏండ్లపాటు ఆపేశారని మండిపడ్డారు. పీఎఫ్ఐ సంస్థలను ప్రోత్సాహిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అర్వింద్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నంత వరకు కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేరదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామంటూ మాయమాటలు చెప్పి గద్దెనెక్కారని అన్నారు.

సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అమిత్ షా

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం : పోచారం

బాన్సువాడ, మే 5 : ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ధ్యేయమని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఆయన స్వగృహంలో పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడారు. తన 47 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో పెద్ద పెద్ద పదవుల్లో పనిచేసినా కక్షసాధింపు, అణచివేత ధోరణి ప్రవర్తించలేదన్నారు. కానీ.. తనవెంటే ఉంటూ పదవులు అనుభవించి, కోట్లాది రూపాయలు సంపాదించుకొని మోసం చేసిన వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. పరిస్థితులు ఎప్పటికీ ఒక్కలా ఉండవని, ఏ పార్టీ అధికారంలో ఉంటుందో చెప్పలేమని, తనకూ సమయం వస్తుందన్నారు. నిజమైన కార్యకర్తలు తన వెన్నంటే ఉన్నారని చెప్పారు.

వర్ని నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్ జిల్లాలో అదృశ్యం..

నిజామాబాద్ అటవీ ప్రాంతంలో మృతదేహం

- నేరడిగొండవాసి హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు

వినాయక్‌నగర్, మే 5: ఆదిలాబాద్ జిల్లాలో అదృశ్యమైన ఓ వ్యక్తి నిజామాబాద్ అటవీ ప్రాంతంలో హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నేరడిగొండ ప్రాంతానికి చెందిన వ్యక్తి గత నెల 22వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి సెల్‌ఫోన్ కాల్ డాటా, సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా నిజామాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తితో తరచూ సంభాషించినట్లు గుర్తించారు. ఆదివారం ఇక్కడికి చేరుకొని నగర పోలీసుల సహకారంతో రూరల్ పరిధిలో నివాసముందే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటికి వచ్చింది. అదృశ్యమై వ్యక్తిని మల్లారం అటవీ ప్రాంతంలో హత్యచేసి మృతదేహాన్ని దహనం చేసినట్లు నిందితుడు వెల్లడించారు. నిజామాబాద్ సౌత్, నార్త్ రూరల్ సీఐలు సురేశ్, సతీశ్‌కుమార్‌తో పాటు నేరడిగొండ పోలీస్ బృందం ఘటనా స్థలానికి వెళ్లి ఎముకలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. హత్యకు గల కారణాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. అయితే వారిద్దరి మధ్య వాట్సాప్ ద్వారా పరిచయం ఏర్పడగా, లైంగిక సంబంధం ఉన్నదని తెలిసింది.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

రెంజల్, మే5: మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి డబ్బు, మద్యం తరలించకుండా పోలీసులు నిఘా ఉంచారు. అక్కడి నుంచి వస్తున్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తూ పత్రాలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

'బీజేపీ మాయమాటలు నమ్మొద్దు'

ప్రచారం నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, మే3: మండలంలోని బెల్లాల్, అమ్దాపూర్ గ్రామాల్లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు గంగాశంకర్, పల్లెన్న, పొరెడ్డి గంగాధర్, జయరాజు, పొరెడ్డి సురేందర్‌తోపాటు తదితరులున్నారు.

35వ వార్డులోని హుస్నాబాద్‌గల్లీలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I PULLURI MEENA D/O PULLURI GANGADHAR(OLD NAME) IS HERE BY DECLARE THAT CHANGE MY NAME AS **PANDENA DEVAKI W/O PANDENA BHUMESHWER** (NEW NAME) R/O H.NO: 3-54/1 VIL: KUKUNUR MDL:VELPUR DIST: NIZAMABAD.TS.

NTZ-000

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పారిశుద్ధ్యంపై పట్టింపేదీ..

- తుప్పపట్టి డిపోయిన చెత్త డబ్బాలు
- స్పందించని మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్, మే5: పారిశుద్ధ్య సమ్యలపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని 35వ వార్డు హుస్నాబాద్ గల్లీలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు తుప్పుపట్టి రంధ్రం పడ్డాయి. వాటిలో చెత్త వేస్తే కిందికి కారిపోతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు ఇంటి పన్ను మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, పరిశుభ్రతను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెడిపోయిన డస్ట్‌బిన్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిరావలి

సిరికొండ, మే 5 : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావలని పార్టీ మండల అధ్యక్షుడు నరవోయిన శ్రీనివాస్ కోరారు. సాయంత్రం 6 గంటలకు రోడ్‌షో ఉంటుందని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో అపూర్వ సమ్మేళనానికి హాజరైన 97-98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

అపూర్వం.. అద్వితీయం

- ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు
- 1997-98 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

మోర్తాడ్, మే5: వారంతా నాలుగు పదుల వయస్సున్న వారే.. బాధ్యతల్లో తీరిక లేకుండా గడిపే వారే.. అయినా ఒక్కసారిగా పసి పిల్లలుగా మారిపోయారు. పాత మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆడి పాడారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు అద్భుతంగా సాగాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకు ఆద్యంతం కోలాహలంగా కొనసాగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక్కచోటకు చేరారు. పాతికేళ్ల క్రితం విడిపోయిన మిత్రులు రెండున్నర దశాబ్దాల తర్వాత కుటుంబాలతో సహా కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ బాల్య మిత్రులతో సరదాగా గడిపారు. అర్ధాంతరంగా కోల్పోయిన సహచరులను గుర్తు చేసుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు.

తమకు మార్గదర్శనం చేసిన ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. వారు చెప్పిన బోధనలు తమ జీవితాలకు ఎలా బాటలు వేశాయో సోదాహరణంగా వివరించారు. విద్యాబుద్ధులు చెప్పిన టీచర్లు ప్రతాప్ రెడ్డి, నాగయ్య, రుక్మయ్య, పురుషోత్తం శర్మ, సురేశ్‌బాబు, ధర్మారెడ్డి, లింబాద్రి, గంగారాం, ప్రతాప్‌గౌడ్, విజయలక్ష్మి, అంజయ్య, బాబురావు సార్లకు ఆత్మీయ సత్కారం చేశారు. పూర్వ విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు సైతం మురిసి పోయారు. వయస్సు మరిచి వారితో కలిసి పోయారు.

జిల్లా కేంద్రంలో 1998-99 బ్యాచ్ విద్యార్థులు..

ఖలీల్‌వాడి, మే 5: జిల్లా కేంద్రంలోని శ్రీ పద్మశాలీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1998-99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబురాలను నిర్వహించారు. వారు చదువుకున్న పాఠశాల ప్రాంగణంలోనే సమావేశమైన పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

జిల్లా కేంద్రంలో 1998-99 బ్యాచ్ విద్యార్థులు

సందర్శకులపై స్విమ్మింగ్‌పూల్ సిబ్బంది దాడి

మాక్లూర్, మే5: మండలంలోని మదన్‌పల్లి గ్రామ శివారులోని ఓ ప్రైవేటు గార్డెన్‌ను చూసేందుకు, స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లిన నలుగురు సందర్శకులపై స్విమ్మింగ్‌పూల్ సిబ్బంది దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. నలుగురు సందర్శకులు ఆదివారం గార్డెన్‌కు వెళ్లారు. అక్కడ పని చేసే సిబ్బంది టికెట్లు ఇచ్చే సమయంలో సందర్శకులతో వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరగడంతో సందర్శకులపై సిబ్బంది దుర్భాషలాడారు. ఎందుకు దుర్భాషలాడుతున్నారని ప్రశ్నిచడంతో అందులో పనిచేసే సిబ్బంది సందర్శకులపై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబీకులు వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. సంఘటన స్థలాన్ని మాక్లూర్ ఏఎస్సై నర్సయ్య పరిశీలించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఆల్ఫాజోలం పట్టివేత

భిక్కనూరు, మే 5: మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామశివారులో శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. కారులో కొంత మంది నిషేధిత ఆల్ఫాజోలం మందును అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంకు పక్కన నిలిపి ఉంచిన కారును స్వాధీనం చేసుకొని అందులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. ఆ ముగ్గురు ఇచ్చిన సమాచారం మేరకు బీటీఎస్ వద్ద మరొకరిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.50 లక్షల విలువ గల ఆల్ఫాజోలం, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.37 వేల నగదుతోపాటు కారును సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ తెలిపారు. వారిని 14 రోజులు రిమాండ్ కోసం నిజామాబాద్ జైలుకు తరలించామని పేర్కొన్నారు.

'విద్యా శాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

భీమ్‌గల్, మే 5: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సంక్షోభానికి కారణమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివాదం పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన పదోన్నతులు కొనసాగింపునకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్‌పీటీఈ వివరణ తీసుకోవాలని పదేపదే ప్రతిపాదించగా ఫిబ్రవరిలో లేఖ రాసి రహస్యంగా ఉంచారని ఆరోపించారు. పెండింగ్ ఉన్న నాలుగు వాయిదాల కరవుభత్యాలను విడుదల చేయాలని, గత పీఆర్‌సీ బకాయితో సహా ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా కారల్‌మార్క్స్ జయంతి

నివాళులర్పిస్తున్న నాయకులు

మోర్తాడ్, మే 5: మోర్తాడ్‌లో కారల్‌మార్క్స్ జయంతిని దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారల్‌మార్క్స్ శ్రామిక మహోపాధ్యాయుడని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి రాజారాం, జాంభవ, మామిడి రవి, గంగాధర్ పాల్గొన్నారు.

డెయిరీ షెడ్డు దగ్ధం

దగ్ధమైన డెయిరీ షెడ్డు

మోర్తాడ్, మే5: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం మంగి హరీశ్‌కు చెందిన డెయిరీఫామ్‌షెడ్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సమయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. షెడ్‌తోపాటు, పశువుల దాణా, దాణా తయారు చేసే సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.7లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

'బీజేపీకి ఓటు వేయొద్దు

మాక్లూర్, ఏప్రిల్5: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయవద్దని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల ప్రధాన కార్యాదర్శి దేశెట్టి సాయరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించిందిన్నారు. రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందన

శక్కర్‌నగర్, మే 5: బోధన్ పట్టణానికి చెందిన హదియా జోహా అనే విద్యార్థిని పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ మార్కులు సాధించగా అబ్దుల్ ఖాదర్ జిలానీ సొసైటీ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. రాబోయే రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

బోధన్ పట్టణ బీజేవైఎం అధ్యక్షుడిగా గౌతం గౌడ్

శక్కర్‌నగర్, మే 5: బోధన్ పట్టణ బీజేవైఎం అధ్యక్షుడిగా గౌతం గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలిప్యాక బాల్‌రాజు గౌతం గౌడ్‌కు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు.